# చెట్టుమీది కొండడు

శ్రీ వి. భాస్కర్

కొండయ్యకు ఏడెనిమిది మంది పిల్లలు. తల్లి దండ్రుల్తో చేరి ఆయన కుటుంబంలో పన్నెండు మంది ఉన్నారు. తనకున్న రెండెక రాల పొలాన్ని కష్టపడి సాగుచేసి ఎంతో కష్టంమీద తన కుటుంబాన్ని ముందుకు తీసుక పోతున్నాడు.

ఆ ఏడు వర్షాలు సరిగా వర్షించక రైతు లంతా నాశన మయ్యారు. కొండయ్య కుటుంబం రోజుల తరబడి పస్తులుండి నానా అవస్థలూ పడింది. ఆ ఏడే దుక్కిటెద్దుకు జాడ్యం తగిలి చచ్చిపోయింది. దాని జత గిత్త ముసలిదై పోవటంతో నలభై రూపాయ లకు కొండయ్య దాన్ని అమ్మేశాడు. ఆ ఎద్దులు పడిపోవటంతో కొండయ్యకు మూడు వందల రూపాయలు మునిగింది.

కరువు కాటకాలకు తోడు ఉన్న గిత్తలూ నాశనం కావటంచేత కొండయ్య కుటుంబం దిగాలు పడింది. పుట్టెడు జనం తినటానికి తిండి సంపాదించుకోవటానికి మార్గం గోచ రించక కొండయ్య క్రుంగి పోయాడు. కొన్ని రోజులకే దేవుడు చల్లని చూపు చూశాడు.

వర్షాలు కావలసినంత కంటే ఎక్కువ గానే పడ్డాయి. కాని మన కొండయ్య పొలందున్ని గింజలు విత్తటానికి ఎద్దుగొడ్లు లేవు. అందరూ వారి వారి భూముల్లో దున్నుకొంటున్నారు. కొండయ్య కేమీ అర్థంకాలేదు. ఇంట్లో డబ్బులేకుండా ఎద్దు గిత్తల పట్టటానికి ఎలా కుదుర్తుంది?

ఎన్నో తంటాలుపడి ఓ ఆసామి వద్ద రూపాయికి నెలకు కానీ వడ్డీతో మూడు వందల రూపాయలు బాకీగా పుచ్చుకుని బయలు దేరాడు. అందరూ వారి వారి పనుల్లో ఉండటం వల్ల ఎద్దుల్ని పట్టటానికి తోడెవరూ లేకపోయారు కొండయ్యకు. ఎలాగైనా గిత్తల్ని తోలుక రాకపోతే సాగుచేయుటం సాధ్యంకాదని డబ్బుల్ని మొలలో భద్రపరచి గిత్తలకోసం ఊరూరు చుట్టుకుంటూ వచ్చాడు. సాయంత్రానికి ఒకపల్లె చేరుకున్నాడు. అపట్టణానికి రెండు మైళ్లదూరంలో ఉంది.

చీకటి పడిపోయింది. కాబట్టి ఈరాత్రికి ఆవూళ్లోనే తల దాచుకుందామని వీధిని వెళ్తున్న ఒకపెద్దమనిషి పడుకోవటానికి కాస్తచోటిప్పించమని అడిగాడు కొండయ్య. ఆపెద్దమనిషి కొండయ్య సంగతంతా అడిగి తెలుసుకున్నాడు. కొండయ్య దగ్గర గిత్తల కోసం డబ్బు ఉంటుందని ఊహించు కున్నా డాయన.

ఆపెద్దమనిషి 'ఫరవాలేదు మాయింటి దగ్గరే పడుకుందురుగాని రమ్మ'ని కొండ య్యను తీసికెళ్ళాడు. బయట వరండాలో మంచం మీద పడుకోమని కొండయ్యకు

తెలిపి ఇంట్లోకెళ్ళి ఎవరితోనో అరగంటసేపు గుస గుసలు జరిపి బయటికొచ్చాడు.

"కమలా! ఈయన పడుకున్నాడిక్కడ. ఇంటిదగ్గఱ జాగ్రత్తగా ఉండండి. ఇప్పుడే వస్తానని" వెళ్ళిపోయి మరలా అర్థగంట కల్లా మరోవ్యక్తితో ఇంటికొచ్చాడు.

"మేం ఇంట్లో పడుకొంటాం. మీరిక్కడే భద్రంగా పడుకుంటారుగదూ...?" అని ప్రశ్నించాడు కొండయ్యను. "సరేనండీ! అలాగే పడుకోండి మీరు. నాకేం ఫరవాలేదని" కొండయ్య అన్నాడు.

వారిద్దరూ ఇంట్లోకెళ్ళి గడియ బిగించుకొని పడుకొన్నారు. మన కొండయ్యకు మనస్సును ఎంతచిక్క బట్టుకున్నా నిదుర రాలేదు. తన చేతనున్న డబ్బుల్ని దోచుకోవటానికి ఎవ రేం జేస్తారో యన్న భయంతో కదలకుండా పడుకున్నాడు. చీమ చిటుక్కు మన్నా ఉలిక్కి పడేవాడు.

సుమారు తొమ్మిది పదిగంటల రాత్రి కల్లా ఇంట్లో ఎదో తవ్వుతున్నట్లు శబ్దం వినిపించింది. కొండయ్యకు గుండెలు జోరుగా కొట్టుకో సాగాయి. చెవులు దిక్కించి కవాటపు రంధ్రాల్లోంచి వచ్చే శబ్దాన్ని వింటున్నాడు. కొండయ్య లోపలినుండి అస్పష్టంగా మాటలు వినిపించాయి. బాగా చెవియొగ్గి ఆలకించాడు. "ఇం...కా...రాత్రి...వెనుక ...చంపితే...ఇప్పుడు మేల్కొని..."

కొండయ్య దేహం కంపించి పోయింది. తల దిమ్మెక్కి పోయినట్లైంది. ముందు కెళ్ళటానికి అడుగు సాగటం లేదు. ఇక ఒక్క సెకెండు అక్కడ నిలువటానికి గూడా సాధ్యం కాలేదు కొండయ్యకు. తడబడ్తూ మంచం దగ్గరకెళ్ళి దుప్పటి భుజానేసుకొని తిన్నగా చీకట్లో తడవుకుంటూ ప్రక్కనే యున్న రోడ్డుచేరుకున్నాడు.

దూరంగా వెళ్ళటానికిగాని, అక్కడే నిలువటానికిగాని ధైర్యం చాలక పోయింది కొండయ్యకు. ఇంతలో ఆ త్రోవన ఎవరో వస్తున్నట్లు గుర్తుపట్టి ప్రక్కనే యున్న చింత చెట్టెక్కాడు చప్పుడు గాకుండా. చెట్టు కొమ్మల మీద ఆతడు నిలువ లేనంతగా వణికి పోతున్నాడు.

కొంతసేపటికి ఎవరో ఒకవ్యక్తి తానున్న ఇంటివేపుకే వెళ్ళటం గమనించాడు. కొండయ్యకు చెట్టుమీద నుండి అంతా అగుపిస్తున్నది. ఆవ్యక్తి తాను పరున్న మంచం మీదనే పడుకొన్నాడు. అంతటితో కొండయ్యకు కొంచెం శాంతి గలిగింది. కృష్ణ పక్షమైనందువల్ల చంద్రుడు ఉదయించాడు మరి కొంత సేపటికి.

తన మంచం దగ్గఱ ఎవరో పరున్న వ్యక్తిని ఏమో చేయుచున్నట్లగుపించింది. మరి కొంత సేపట్లో అక్కడికెవరో దీపంపట్టుకొచ్చారు.

వెలుతుర్లో 'మా బావే!' అని కేక వినిపించటంతో ఠపీమని శబ్దం, వెలుతురు లేక పోవటం జరిగింది. కొండయ్యకు శరీరం గజగజలాడి పోయింది. తాననుకొని ఆ పడుకున్న వ్యక్తిని యింటి ఆసామీ చంపేశాడని

అర్థం జేసుకున్నాడు. తన ప్రాణాలు మాత్రం దక్కగలవా యన్న అధైర్యంతో స్తబ్ధుడై పోయాడు చెట్టుమీది కొండయ్య. మరలా ఆ ఇంట్లో ఏడ్పులు సన్నగా విన బడ్డాయి. తెల్లవారు ఝామున్నే ఇంటి ఆసామీ, కూతుళ్ళు బాను దిక్కుగా వెళ్ళిపోవటం చూశాడు.

చెట్టుమీదనే కొండయ్యకు ఏడు గంట లైంది. దిగటానికి ధైర్యం చాలక అలాగే ఉన్నాడు వణకిపోతూ కొండయ్య. ఆ రాస్తాలో మోటారు వస్తుండటం గమనించి కొండయ్య గట్టిగా అరచేశాడు. ప్రయాణీకులా మనిషి స్థితి కనుక్కోవటానికి బస్సు నిలిపి దిగి రమ్మని ఎంత బ్రతిమాలినా, ధైర్యం చెప్పినా బస్సులోని వారంతా దిగి చెట్టు క్రిందికివస్తే దిగుతానని పట్టు బట్టాడు.

ఆలాగే అందరూ దిగి కొండయ్యను దించుకొని సంగతి నడిగారు. జరిగిందంతా చెప్పేశాడు. కొండయ్య వెంటనే పోలీస్ స్టేషన్లో రిపోర్టుచేసి శవంతోపాటు తండ్రీ కూతుళ్ళను రిజిస్ట్రార్ ఆఫీస్ దగ్గర అరెస్టు చేశారు రక్షక భటులు.

కొండయ్యను చంపదలచి అతడు పడక నుండి లేచిపోయి ఆయింటి అల్లుడు సినిమా కెళ్ళివచ్చి పడుకోవటంతో అతని మామ గారే చంపినట్లు, కూతురు గోలచేయ టంతో శవాన్ని ఇంట్లోనే త్రవ్వీన గుంటలో పూడ్చేసి కూతుర్ని సమాధాన పరచటానికి తన ఆస్తి పాస్తుల్ని ఆమెకిచ్చి వేయటానికి రిజిస్ట్రార్ దగ్గర కెళ్ళాడని మరలా తెలిసింది.

అచ్చుపనులయందు

మీకు కావలసినది!

- అందమగు కూర్పులు
- చిన్నపనియైనను బాగుగా చేయుట
- సకాలమునకు ముద్రించి ఇచ్చుట

మీ అన్ని రకముల అచ్చుపనులను సరసమయిన చార్జీలకు చక్కగా చేసి యివ్వగలము.

ఇప్పుడు గ్రంథములనుకూడ అచ్చువేయుటకు తీసుకొనుచున్నాము.

లోధ్ర ముద్రణాలయము

రాయపేట, మద్రాసు-14.